**కథానిక**

# పొరపాటు

చందు సుబ్బారావు

బ్రహ్మానికి ఎవడికైనా సహాయం చెయ్యట మంటే మహా చిరాకు. 'వేలిరిగింది— కేవలం అల్పాచమానం వైద్యం' అంటే 'ఇప్పుడు ఖాళీ లేద'ని లేచ్చక్కా పోతాడు. "ఊళ్ళో పాలూ, వంపులో నీళ్ళూ, బళ్ళూ, ఓడలూ అన్నీ తనకోసం స్వర్గం నుండి ఊడి పడ్డాయి. ఒకళ్ళతో పనేమిటి? పిల్లికి బిచ్చం వేస్తే బలిసి ఎలికల్ని తినటం మానివేస్తుంది. వీళ్ళందరికీ ఉపకారాలు చెయ్యటానికే నేమిటి నేను పుట్టింది...."....దాదాపు ఇదీ బ్రహ్మం బ్రతుకు వేదాంతం.

అయితే బ్రహ్మానికి తండ్రి పోలికొచ్చిం దేమో కాని, పాపం అతని తల్లి మరో రకం మనిషి.

ఊళ్ళోవాళ్ళందరికీ ఏదో ఉపకారం చేద్దా మన్న తాపత్రయం గలిగింది. పెళ్ళిళ్ళకు పిండివంటలు చేసి పెట్టా — పచ్చళ్ళు పట్టి పెట్టా—కడుపుతోన్న పిల్లలకు పుల్లగాయలు పంపించా—కాపురాలు చెడిపోతుంటే అడ్డం పడి అటూ ఇటూ రాయబారం సాగించా— కన్ను నీరు కారినా -కాలు లావు పారినా తెలి సిన నాటు వైద్యం తూ. చా. తప్పకుండా చేయించా—

ఊరంతా నా పిల్లలనుకునే మనిషి బ్రహ్మం తల్లి—బ్రహ్మానికి తల్లింటే మంట—కత్తితో కోద్దునా—గొడ్డలితో నరుకుదునా అనుకుం టాడు.

'గంగిరెద్దు ముండ—ఇంటింటికీ పోయి తలూపు తుంది. ఆడించుకుని పంపిస్తుం టారు—' అంటాడు బ్రహ్మం—

"ఊరంతా పనిమనుషులు పెట్టుకోవద్దని దండోరా వేయిస్తాను. అంట్లుతోముకుని బ్రతుకుదువు గాని...."—బ్రహ్మం।

'తప్పర్రా నాయనా—నలుగురు మేలో రిస్తేనే భగవంతుడు మన మేలోరుస్తాడు— ఏనాటి కే వారమో....పుణ్యం పెరట్లో చెట్టురా—నీరుపోసి పెంచుకోవాలి....' తల్లి।

'పెంచుకోవాలి—పెంచుకోవాలి— నిన్ను దొడ్లో పాతేస్తే మొక్కయి పెరుగు దువు గాని....' బ్రహ్మం ఆగ్రహం....

బ్రహ్మం ఇలాంటివాడని గ్రహించి వాళ్ళమ్మతో మాట సాయం కోరేవాళ్ళంతా బ్రహ్మం ఇంట్లో లేనప్పుడు వస్తుండేవాళ్ళు. 'ఆయనుంటే వచ్చెయ్యి' అని ఊళ్ళో తల్లు లంతా పిల్లలకు తర్ఫీ దిచ్చారు.

ప్రక్కింటి వెంకయ్య సన్నకారు రైతు. ఓ అర ఎకరం నిమ్మతోట కౌలుచేసుకుని బ్రతుకుతున్నాడు. భార్యకు ఒంట్లో నలత చేసినా, కూతురుకు కానుపొచ్చినా బ్రహ్మం తల్లే పరుగెత్తుకొచ్చేది.

'ఆవిడ రుణం ఎలా తీర్చుకోవాలో' అనుకుంటున్న వెంకయ్యకు ఆ ఏడు నిమ్మ తోట విరగ్గాసింది.

ఓ రోజు ఆనందంగా బంతుల్లాంటి రెండొందల నిమ్మకాయలు ఏరి సంచిలో పోసి చిన్నకొడుకు చేతికిచ్చి 'మామ్మ' గారి కిచ్చిరమ్మన్నాడు వెంకయ్య.

ప్రస్తుతం వున్న చట్టాన్ననుసరించి జేబు దొంగ పెద్ద అపరాధి (క్రిమినల్). కాని తన వాటాదార్ల కోట్ల రూపాయలు అపహరించినవాడు, కార్మికులకు యివ్వవలసింది యివ్వక కాజేసినవాడూ ఉత్త ఆర్థిక నేరస్తుడు మాత్రమే.

జార్జ్ ఫెర్నాండేస్

పిల్లవాడు పోయి బ్రహ్మం ఇంటి తలుపు తట్టాడు.

బ్రహ్మం తలుపు తీసాడు. ఉరిమి పిల్లవాడి వంక చూస్తూ 'ఏం నాయనా' అన్నాడు ముప్పావు వెటకారంగా.

పిల్లవాడు కంగారుపడి 'మరండీ-మామ్మగారండీ-నిమ్మకాయలండీ....' అన్నాడు.

బ్రహ్మం ఒక్కపట్టున లేచిపోయి, పిల్లిని చూసి పులి అనుకున్నవాడిలా ముఖంపెట్టి, 'నిమ్మకాయిలా - పచ్చడి పెట్టాలా - మాకేం పనుల్లేవనుకున్నారా - ముసలిముండ లేదు - చచ్చిపోయిందని చెప్పు - పో నాయనా-పో-' అంటూ వెటకారాలూ, మిరియాలూ ఒలకపోసి పిల్లవాడి ముఖం మీద తలుపు వేసాడు।

పిల్లవాడు తిరుగుముఖం పట్టాడు.

సంచిలో నిమ్మకాయలకు నోళ్ళల్లో నీళ్ళూరాయి।

## లేఖలు

### 'అభ్యుదయ' గురించి

పత్రిక ఎంతో ఆసక్తికరంగానూ, అభ్యుదయ రచయితలకు ఆశాజనకంగానూ వుంటున్నది. ఇటీవల వెలువడిన ఆగస్టు 1977 సంచిక కూడా అంది ఎంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. అభ్యుదయ రచయితల నందరినీ — వాళ్ళ భావాలనీ ఈ రూపంలో ఒక్క వేదిక మీదికి సమీకరిస్తున్నందుకు మదరాసు శాఖకు నా ప్రత్యేకమైన అభినందనలు. ఇదివరకు వచ్చిన వాటికన్న ఈ ఆగస్టు సంచిక గుణగణాల్లో అన్ని విధాలా మించి, సాహితీపరులను ముఖ్యంగా అభ్యుదయ భావాలుకల రచయితల్ని ఉత్తేజపరుస్తున్న దనడంలో సందేహం లేదు. ఇట్లాగా మీ కృషి నిరంతరాయంగా సాగాలని ఆశిస్తూ.

హనుమకొండ పేర్వారం జగన్నాధం

* * *

'అభ్యుదయ'ను సమగ్రమైన పత్రికగా మార్చడం ఎంతో సంతోషాన్ని కలిగించింది.

ఈ ప్రయత్నం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ సాహిత్య పత్రికల్లో ఉన్నత స్థానాన్ని త్వరలో పొందగలదని ఆశిస్తున్నా.

వరంగల్ మాదిరాజు రంగారావు

* * *

'అభ్యుదయ'లో వెలువడుతున్న చిట్టికథలు-పొట్టికథలు (చిట్టి పొట్టి కథలు) చదవడానికి బాగుంటున్నాయి. ప్రగతిపథంలో నడుస్తూ, రచనలో తగినంత వేడిమి, వాడిమీ కలిగి వుంటున్నాయి. సంతోషం. వచన కవితలన్నీ చురుకుగా సాగి చురుక్కుమని పొడుస్తున్నాయి. అవీ ఆస్వాద్యంగా ఉన్నాయి. మీ సమితి వారి కృషిని హృదయపూర్వకంగా అభినందిస్తున్నా.

ఆలిఘర్ అయాచితుల హనుమచ్ఛాస్త్రి

* * *

'అభ్యుదయ' ఆగస్టు సంచిక చూసినాను. చాల నచ్చింది. తెనుగులో మరో విప్లవ గర్జన. ప్రఖ్యాత విప్లవకవి 'నజ్రుల్ ఇస్లామ్' గురించిన పుటంకింపు పురిపండావారు అభ్యుదయ చేతనతో రాసినారు. చిరకాలం జ్ఞప్తి వుంటుంది. చిరుకవితలు, కథలూ, సూక్తులు పత్రికకు వన్నె తెచ్చినాయి. పరదేశీయుల యొక్క కవితా పరిచయం—మీ పత్రిక విశాలత్వాన్ని వేయివేల గొంతులతో సాక్ష్యం పల్కుతున్నాయి.

బరంపురం 'గుల్నార్'

సెప్టెంబరు 4 (ఆదివారం) సమావేశం

*1. 'ఆధునిక తమిళ సారస్వత రీతులు'*

వక్త: శ్రీ మదివానన్

*2. 'ఆధునిక కన్నడ సారస్వత రీతులు'*

వక్త: శ్రీ సి. ఆర్. కృష్ణారావు

స్థలం: పొట్టి శ్రీరాములు స్మారక మందిరం

ప్రారంభం: సాయంత్రం 6 గంటలకు

అందరికీ స్వాగతం